# సజల నయనాలు

## మునుసూరి పేరయ్యశాస్త్రి

ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్లందరూ - అక్కడి కొచ్చిన వరంధామయ్యగార్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు కొందరు వింతగా చూస్తున్నారు. వాళ్ల చూపుల అంతరార్థాన్ని గమనించిన వరంధామయ్య సిగ్గు పడక తప్పలేదు.

"ఏ వండీ...మీరూ ఇంటర్వ్యూకే వచ్చారా!"

"అవున్నాయనా!"

"మీ వయసెంతండి"

"అరవై అయిదు"

"ఇంత క్రితం ఏం చేసే వారు?"

"టీచర్‌గానే చేసి రిటైరయ్యాను"

బయటే చాలా మంది ఆయన్ను ఇంటర్వ్యూ చేసేస్తున్నారు. మరికొందరు ఇంత వయసులో కూడా ఈ వెయ్యి రూపాయల టీచర్ ఇద్యోగానికి వచ్చారన్నట్లు జాలిగా చూస్తున్నారు. ఆయన రాక వెనుకున్న పరిస్థితుల్ని అర్థం చేసుకొవటానికి ప్రయత్నం చేస్తున్నారు.

అవును...

రిటైర్ అయ్యాక హాయిగా కృష్ణా రామా అంటూ. కాలక్షేపం చేసే పరిస్థితి కాదాయనిది.

ఆలస్యంగా పుట్టిన సంతానం....

కొడుకు ఎదిగొచ్చినా...

ఉద్యోగస్థుడైనా - పెళ్ళికెదిగిన కూతురుంది.

"ఏ మండీ! మీరు కూడా వాడికి చేయూతగా ఉండటానికి ఏమైనా చిన్న ఉద్యోగం చూసుకోండి...." అని భార్య అన్నప్పుడు నిజమే ననిపించింది. గడచిన సంవత్సరం ఒక స్కూల్లో పని చేశారు. వేసవి సెలవుల ముందు పీకేశారు. మళ్ళీ ఈ సంవత్సరానికీ ప్రయత్నం. ఈ సంవత్సరం కూడా కష్ట పడితే - ఏదో అయిదు వేలు కొడుక్కి ఇవ్వచ్చున్న ఆలోచన.....

"వరంధామయ్యా!"

ఆ పిలుపు విని ఉలిక్కి పడ్డారాయన. లేచి పరుగు లాంటి నడకతో ఇంటర్వ్యూ చేసే గదిలోకి అడుగు పెట్టారు. ప్రిన్సిపాల్ స్థానంలో ఒక యువకుడు దర్జాగా ఉన్నాడు. ఆయన ప్రక్కన పెద్ద మనిషి స్కూల్ కమిటీ చైర్మన్.

"కూర్చోండి" ప్రిన్సిపాల్ అన్నాడు.

వరంధామయ్య కూర్చున్నారు. ఇంటర్వ్యూ ప్రారంభమైంది.

"మీ వయసెంతండి?" మొదటి ప్రశ్న ప్రిన్సిపాల్ ద్వారా!

ఆయన చెప్పారు.


"మంచి సర్వీసున్న ఉపాధ్యాయులని మీ అప్లికేషన్ బట్టి తెలుస్తోంది... కానీ ఈ స్కూల్ గవర్నమెంట్‌ది కాదు.... ఎంత వయసొచ్చినా బెల్.... బిల్లూ ముఖ్య మనుకుంటూ కాలక్షేపం చేసేసి మీ బాధ్యత నెర వేర్చుకోవటానికి"

ప్రిన్సిపాల్ మాటలకి వరంధామయ్య గారి మనసు చివుక్కు మంది.

"సార్... నేను గవర్నమెంట్ బళ్లల్లో పని చేసినా ఎక్కడ పనిచేసినా వృత్తికి అన్యాయం చేయలేదు."

ప్రిన్సిపాల్ నవ్వాడు.

"వెరీ గుడ్.... ఈ వయసులో మీరు మాకెమి




సేవలందించ గలరు. అయినా రిటైర్డు వాళ్లు కావాలన్నాము గదాని - మీయంత వయోవృద్ధులను తీసుకొని - మేము స్కూల్ నడపలేము."

ప్రిన్సిపాల్ మాటలు సంస్కారం లేని మాటలుగా అనిపిస్తున్నాయి. వరంధామయ్యగారు తలొంచుకొని కూర్చున్నారు.

"ఏమైనా ప్రశ్నలు వేస్తారా!" చైర్మన్ అడిగాడు.

ప్రిన్సిపాల్ నిట్టూర్చి, "వేస్ట్ సార్..." అని, "చూడండి వరంధామయ్యగారూ! మీకు ఉద్యోగం అవసరం....కాదనను... కానీ, మీ సమస్యలు - బాధ్యతలు పొగొట్టడానికి - మీకు ఉద్యోగ మిచ్చే ధైర్యం మాకు లేదు. ఇంకొసారి చూద్దాం.... ఈ సారికి వెళ్ళీరండి...." అన్నాడు.

వరంధామయ్య గారి ముఖం వెల వెల బోయింది. చిన్న బుచ్చుకొన్న ముఖంతో లేచి నిలబడ్డారు. అంత వరకూ లేని వార్ధక్యం - విరుచుకొని మీద పడ్డట్టుగా అనిపించింది. తన శరీరమే తనకు బరువైనట్లుగా అనిపించింది. ఆ శరీరాన్ని ఈడ్చుకొంటూ బయట పడ్డారు. రోడ్డు




వారగా నడుస్తున్నారు. చుట్టూ జనప్రవాహం - వాహనాలు తిరుగుతున్నా సుదీర్ఘ ఎడారి బాటసారిలా ఒంటరి తనం అనుభవిస్తూ నడుస్తుండగా వెనుక నుండి చప్పట్లు.....

ఆగి వెనక్కి తిరిగారు. ఒక వ్యక్తి ఆయనవైపే నడుస్తూ వస్తున్నారు. వయసులో పెద్దవాడే. దగ్గరగా వచ్చాడు.

"హమ్మయ్య! నువ్వు అవునో కాదో, అనుకున్నాను...ఏరా నన్ను గుర్తు పట్టలేదా!" అంటున్న ఆయన్ను పరిశీలనగా చూస్తూ...."నువ్వు సీతారామయ్యవి కదూ!" అన్నారు వరంధామయ్య.

"అవున్రా! నువ్వు నేనూ ఒకే ఊళ్లో అయిదు సంవత్సరాలు కలసి పనిచేశాం! ఆ తర్వాత ఇదే కలుసు కోవడం. ఎంతసేపనిలా నిలబడి మాట్లాడు కుంటాం? ఆ హొటల్లో కూర్చుని మాట్లాడుకుందాం" అన్నారు వరంధామయ్య.

ఇద్దరూ హొటల్‌కి వెళ్లారు. కబుర్లలో పడ్డారు. కష్టసుఖాలు తెలుసు కున్నారు.

"మా ఇల్లు ఇక్కడికు దగ్గరే!" అంటూ లేచారు సీతారామయ్య. ఇద్దరూ బయటకు వచ్చారు.

వరంధామయ్యగారు నిట్టూర్చి, "ఒరే...ఇంతసేపు చెప్పకూడదను కున్నాను గానీ - ఇహ ఈ బాధ భరించలేనురా!" అన్నారు.

సీతారామయ్య వెంటనే, "సుఖాలు ఎవరితో పంచుకోక పోయినా పర్వాలేదు గానీ, మనసులోని బాధను మాత్రం పంచుకోవడంలో హాయి ఉంటుంద్రా! చెప్పు...." అన్నారు.

"ఏ ముందిరా! ఈ వేళ ఒక ఇంటర్వ్యూకి వెళ్లాను. కానీ అక్కడ ఆ ఇంటర్వ్యూ చేసే పెద్ద మనిషి మనసు గాయపరచాడ్రా! ముసలి తనం మీద దెబ్బ కొట్టాడు. ముసలి వాళ్లు దేశానికి బరువన్నట్లుగా మాట్లాడాడు. ఏరా! ఉపాధ్యాయులుగా మన వృత్తి కెపుడైనా ద్రోహం చేశామా? అలా కాదట...మనం బెల్లూ, బిల్లూ వరకే పరిమిత మైన గవర్నమెంట్ ఉపాధ్యాయులమట... ఛీ.... సంస్కారం లేని మనిషి - పిల్లలకు సంస్కారమేమి నేర్పుతాడే...." అని చెప్పారు వరంధామయ్య.

సీతారామయ్య ఆయన వంక జాలిగా చూశారు.

"బాధపడకురా! మా వాడు మంచి పేరున్న వాడే! వాడు ఈ సిటీలో ఒక పబ్లిక్ స్కూల్ ప్రిన్స్‌పాల్‌గా చేస్తున్నాడు. పైగా మంచి పేరున్న స్కూల్. వాడితో చెప్పి - నీకేదైనా ఏర్పాటు చేయమంటాను...." అన్నారు ధైర్యం చెబుతున్నట్లుగా.

" చాలా సంతోషంరా!" ఆనందంగా అన్నారాయన.

"ఇంతకీ అంత సంస్కారం లేని ప్రిన్సిపాల్ పనిచేస్తున్న బడి పేరేమిట్రా!" అడిగారు సీతారామయ్య.

"శ్రీగిరి పబ్లిక్‌స్కూలో" చెప్పారు. ఆ పేరు వినగానే సీతారామయ్యగారి ముఖంలో రంగులు మారి పోయాయి. ముఖంలో కంగారు.....

"ఏరా! ఈపాటికి నీ కొడుకింటి కి వస్తాడా!" అడిగారు వరంధామయ్య.

సీతారామయ్య ఉలిక్కిపడి,..."ఆ...వచ్చుంటాడు.....ఒరే...నువ్విక్కడే ఉండు...ఆ కనిపిస్తున్న షాప్ కెళ్ళి వస్తాను..." అని వెళ్లారు. వరంధామయ్య వారగా ఉన్న మైలు రాయిమీద కూర్చున్నారు మిత్రునికోసం ఎదురు చూస్తూ!

అరగంట గడిచింది...గంట...రెండు గంటలు...ఎంతసేపయినా మిత్రుని జాడలేక పోయేసరికి "ఏ మయ్యాడో వీడు" అనుకొంటూ అక్కడున్న షాపులన్నీ చూసి : నిరాశతో ఇంటికి వచ్చేశారు. సీతారామయ్య ఇలా ఎందుకు చేశాడో ఆయనకు అర్థం గావటంలేదు.

నాలుగు రోజులు గడిచాయి.

ఆ రోజు

ఆ ఫీసునుండి కొడుకు వస్తూనే, "నాన్నా! నీ పేర ఉత్తరం కేరాఫ్ నాపేర వచ్చిందేమిటి?" అంటూ కవరిచ్చి వెళ్లాడు.

అలాగా! ఎవరు వ్రాశారో అనుకొంటూ కవరు చింపారు. ఉత్తరం చదవసాగారు. అందులో ఇలా వుంది.

"మిత్రుడు వరంధామయ్యకు,

సీతారామయ్య వ్రాయునది. మీ అబ్బాయి ఆఫీసు పేరు చెప్పావు గదా! అందుకే అక్కడకు వ్రాస్తున్నాను. ఆ రోజు నిన్ను రోడ్డు మీద నిలబెట్టి ఇప్పుడే వస్తానని చెప్పి తిరిగి రాలేదు. అలా కావాలనే చేశానురా! అందుకే ముందు నన్ను నువ్వు క్షమించాలి.

ఒరే...ఏ ప్రిన్సిపాల్ నిన్ను అవమానించాడన్నావో - ఏ ప్రిన్సిపాల్ నీ ముసలితనాన్ని వేలెత్తి చూపాడన్నావో వాడెవరో కాదురా....నాకొడుకు...స్కూల్ పేరు నువ్వు చెప్పగానే అర్థమైంది నిన్ను అన్నవాడు నా కొడుకేనని. నువ్వు మా ఇంటికి వచ్చి - నా కొడుకును చూసి, 'వీడా! నీకొడుకని నువ్వంటే - నీకేమని సమాధానం చెప్పాలో అర్థంగాక - నిన్నలా వదిలేసి వచ్చేశాను.

ఒరే...కన్న తండ్రి, కన్న తల్లి వయసునే గౌరవించలేని వాడు - బయట వాళ్లనెలా గౌరవిస్తాడ్రా! అయినా వాళ్లు సుఖంగా ఉండాలి, హాయిగా ఉండాలని మనం కోరుకొంటాం.

ఒరే....నాదో ప్రార్థన -

వాడిని క్షమించు....

నీ నిష్కల్మషమైన మనసుతో వాడిని ఆశీర్వదించు...

దయచేసి శపించకు....

ఉంటాను....

నీ

సీతారామయ్య..

ఉత్తరం చదవటం పూర్తవగానే వెంటనే ఆయనకు ఊపి రాడనట్లయింది. గుండె ప్రక్కలైన ట్లయింది. మళ్లీ చదివారు... మళ్లీ మళ్లీ చదివారు. సజల నయనాలతో ఉత్తరంలోని ప్రతీ అక్షరంలోనూ మిత్రుని రూపమే చూస్తూ జాలిపడుతుండిపోయారు. ●